W W W.EPAPER.MAHADAILY.COM
మహా పత్రిక
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం
31-7-2025



# సరోగసీ చట్టం కఠినంగా అమలు

- అక్రమాలు దొరికితే కఠిన చర్యలు
- నిబంధనలకనుగుణంగా ఎఆర్‌టి సేవలు అందించాలి
- దంపతుల వివరాలు గోప్యంగా ఉంచాలి
- ప్రతినెల నివేదికలు సమర్పించాలి
- జిల్లా వైద్య విద్యాధికారి కళావతి భాయ్

03



# కొత్తగా 16లక్షల మందికి రేషన్ లబ్ది

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఇందిరమ్మ ప్రభుత్వం లో కొత్తగా 16 లక్షల మందిని పాత కార్డులలో చేర్పించినట్లు రాష్ట్ర రెవినూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో కొత్త రేషన్కార్డుల పంపిణీ కార్యక్రమంను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... తెలంగాణ లో ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిన తరువాత పేదల ముఖంలో సంతోషం కనిపిస్తుందని అన్నారు. ప్రజల దీవెనలతో ఇందిరమ్మ ప్రభుత్వం పాలన కొనసాగుతుందని అన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడ ఇవ్వలేదని అన్నారు.

07



# బీసీల హక్కులకు కాంగ్రెస్ తూట్లు

## తెలంగాణ అధ్యక్షుడు రామచంద్ర రావు

ఉగ్రవాదాన్ని పెంపొందిస్తున్న పాకిస్తాన్‌కు అనుకూలంగా మాట్లాడే కాంగ్రెస్ నేతలు, బీఆర్ఎస్ నాయకులు దేశం పట్ల చిత్తశుద్ధి లేని వారి అసలైన మానసిక దృక్పథాన్ని బహిరంగపరుస్తున్నారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్ర రావు తీవ్రంగా విమర్శించారు. ఇల్లందు లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.

06



## లవర్స్ వీడియో చిత్రీకరించి...

# 60 వేలు డిమాండ్

## భద్రాద్రిలో ఒక ప్రయివేట్ లాడ్జ్ బాగోతం

భద్రాద్రి పుణ్యక్షేత్రంలోని కొన్ని ప్రయివేటు లాడ్జ్ లు అసాంగిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయు. భక్తుల ముసుగులో ప్రేమ జంటలకు రూమ్స్ అద్దెకు ఇస్తూ... వారి వద్ద నుండి భారీ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ విధంగా వచ్చే డబ్బులు సరిపోవడం లేదేమో, తమ వద్ద రూమ్ అద్దెకు తీసుకున్న లవర్స్ నుండి పెద్ద ఎత్తున డబ్బులు వసూల్ చేసేందుకు పట్టణంలోని ఒక ప్రయివేట్ లాడ్జ్ సిబ్బంది స్కెచ్ వేశారు. లాడ్జ్ అద్దెకు తీసుకుని రొమాన్స్ నడుపుతున్నప్పుడు సీక్రెట్ గా వీడియో తీసి బ్లాక్ మెయిల్ చేయడం మొదలుపెట్టారు. ప్రేమ జంట పోలీస్టేషన్ మెట్లు ఎక్కడంతో లాడ్జ్ సిబ్బంది బాగోతం బయటపడింది. ఒక ప్రేమ జంట పట్టణంలోని ఒక లాడ్జ్ రూమ్ అద్దెకు తీసుకున్నారు. వారి రొమాన్స్ దృశ్యాలను లాడ్జ్ సిబ్బంది కిటికీ నుండి రహస్యంగా చిత్రీకరించి లక్ష రూపాయలు డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోతే సొషల్ మీడియా లో పోస్ట్ చేస్తామని బెదిరించడంతో మొత్తానికి రు. 60 వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకు న్నారు.డబ్బులు ఇచ్చాక కూడా ఇంకా డబ్బులు కావాలని బెదిరిస్తుండటంతో, భయపడిన ప్రేమ జంట భద్రాచలం పోలీసులను ఆశ్రయుంచారు. వారి పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

## ఆగస్టు 2న జాబ్ మేళా నిర్వహణ

**ఖమ్మం, మహా:** హెచ్ సి ఎల్ టెక్ ఆధ్వర్యంలో 2023-24, 2024-25 విద్యా సంవత్సరాల్లో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు సాఫ్ట్వేర్ రంగంలో ఐటీ, డిపిఓ ఉద్యోగాల్లో అవకాశం కల్పించడం కోసం ఆగస్టు 2న స్థానిక నయా బజార్ జూనియర్ కళాశాల నందు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి కె. రవిబాబు బుధవారం తెలిపారు. ఎంపిసి, ఎంఇసి, బైపిసి, సిఇసి, హెచ్ఇసి, ఒకేషనల్ గ్రూప్ విద్యార్థులు, 75 శాతం మార్కులు సాధించిన వారు అర్హులని, ఆసక్తి ఉన్నవారు ఆగస్టు 2న నయాబజార్ జూనియర్ కళాశాలలో ఉ. 9.00 గంటలకు ఎస్ఎస్సి పాస్ మెమో, ఇంటర్మీడియట్ పాస్ సర్టిఫికెట్/ఆన్లైన్ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్ నకలు, ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, ఆండ్రాయిడ్ మొబైల్ లతో హాజరుకావాలని ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి అన్నారు. ఇట్టి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం హెచ్ సి ఎల్ ప్రతినిధి ఫోన్ నెంబర్లు 8341405102/7981834205 లను సంప్రదించాలని ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి పేర్కొన్నారు.

## 15 లక్షల భీమా చెక్కు అందజేసిన పోలీస్ కమిషనర్



**ఖమ్మం క్రైమ్, మహా:** గత ఏడాది నవంబర్ లో విధులకు వెళ్తున్న ఖమ్మం యూనిట్ కు చెందిన హోంగార్డు బాణాల రామచారి కి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రముగా గాయపడి తన కాలు కోల్పోయాడు..ఈ నేపథ్యంలో యాక్సిస్ బ్యాంక్ సాలరీ అకౌంట్తో వచ్చే ప్రయోజనాలు, ప్రమాద బీమా సొమ్ము రూ. 15 లక్షల చెక్కును పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేతుల మీదుగా హోంగార్డు కు అందజేశారు. కాలు కోల్పోయి ఇంటి వద్దనే ఉంటున్న హోంగార్డు కుపోలీస్ కమిషనర్ సూచనలతో వైరా ఎస్ఐ రామారావు చొరవ తీసుకుని విజయవాడ కు చెందిన స్వచ్ఛంద సేవకుడు, రిటైర్డ్ విద్యుత్ శాఖ ఉద్యోగి శ్రీనివాసరావు ఆర్థిక సహాయంతో ఇటీవల అదునాతన కృత్రిమ కాలు అందించడం జరిగింది. ఈ సందర్భంగా వారిని పోలీస్ కమిషనర్ అభినందించారు. ఆర్ ఏసీపి సుశీల్ సింగ్, హోమ్ గార్డ్ ఆర్ ఐ సురేష్, వైరా ఎస్ ఐ రామారావు , హోంగార్డ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బంక శ్రీను, సీసీ వెంకటేశ్వర్లు, డి రవిబాబు, సిహెచ్ నాగరాజు, డి రమేష్, రహీమ్, జి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## మహాలయ పక్ష ప్రత్యేక సప్త మోక్ష క్షేత్ర యాత్ర రైలు సెప్టెంబర్ 9వ తేదీ నుండి ప్రారంభం




**ఖమ్మం, మహా:** గుర్తింపుపొందిన ఇండియన్ రైల్వేస్ , భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు , సౌత్ స్టార్ రైల్ ఈ యాత్ర సెప్టెంబర్ 9వ తేదీ నుండి ప్రారంభమవుతుందని , పవిత్ర క్షేత్ర దర్శనాలే లక్ష్యంగా ఆధ్యాత్మిక యాత్రకు శ్రీకారం చుట్టామని స్థానిక ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇండియన్ రైల్వేస్ సౌత్ స్టార్ రైల్ టూర్ టైమ్స్ డైరెక్టర్ జీ.విఘ్నేష్ తెలిపారు . గూడూరు , నెల్లూరు , ఒంగోలు , చీరాల , గుంటూరు , మిర్యాలగూడ , నల్గొండ , హైదరాబాద్ , కాజీపేట స్టేషన్లలో యాత్రికులు రైలు ఎక్కే వీలుందన్నారు . ఈ యాత్ర పదిహేను రోజులు జరగనుందన్నారు . ఇండియన్ రైల్వేస్ , భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు , సౌత్ స్టార్ రైలు , భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ గుర్తింపు పొందిన అగ్రశ్రేణి టూరిస్ట్ రైలు ఆపరేటర్ 'టూర్ టైమ్స్' ఈ యాత్రకు నడుం బిగించిందన్నారు . ఈ యాత్రలో ఉజ్జయిని , ఓంకారేశ్వర్ , ద్వారకా , సిద్ధ పూర్ , మధుర , అయోధ్య , ప్రయాగ్ రాజ్ , వారణాసి , గయ వంటి పవిత్ర పుణ్యక్షేత్రాలను కవర్ చేయనున్నామని చెప్పారు . గతంలో ఇండియన్ రైల్వేస్ టూర్ టైమ్స్ ప్యాకేజీకు విశేష స్పందన లభించిందన్నారు . ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ , తమిళనాడు రాష్ట్రాల నుంచి 650 మంది యాత్రికులతో విజయవంతంగా నిర్వహించామని తెలిపారు .

### నూతన వధూవరులను ఆశీర్వదించిన నామ, తాతా మధు, సండ్ర

**ఖమ్మం అర్బన్, మహా:** తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడు గ్రామ వాస్తవ్యులు తమిర వెంకటరెడ్డి, అనితల కుమార్తె వివాహం ఖమ్మం బైపాస్ రోడ్డు లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో బుధవారం ఉదయం ఘనంగా జరిగింది. ఈ వివాహ కార్యక్రమానికి బిఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు. నామ వెంట బిఆర్ఎస్ నాయకులు కనకమేడల సత్యనారాయణ, బిఆర్ఎస్ వైరా రూరల్ మండల పార్టీ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, మోరంపూడి ప్రసాద్ రావు, బత్తుల శ్రీనివాసరావు, గొడ్డేటి మాధవరావు, మరికంటి రేణుబాబు, వాకదాని కోటేశ్వరరావు, ఎదునూరి శ్రీను, బిఆర్ఎస్ యువత భాస్కర్, నాగేశ్వరరావు, షారుక్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ఖమ్మం,మహా:** జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు అవసరమైన భూ సేకరణ స్పీడ్ అప్ చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్, మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం, జాతీయ రహదారులు, ఖమ్మం ఖిల్లా రోప్ వే వంటి అభివృద్ధి పనుల భూ సేకరణ అంశాలపై బుధవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు, అవసరమైన భూ సేకరణ తదితర అంశాలను అధికారులు వివరించారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ వర్కింగ్ మ్యాప్ ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ఖమ్మం రూరల్, అర్బన్ మండలాల్లో రైతులు అంగీకరించిన స్థలం, ప్రభుత్వ పట్టా భూముల్లో పనులు వేగవంతం చేయాలని అన్నారు. రైతుల పొలాలకు ప్రత్యామ్నాయంగా ప్లాట్ లను కేటాయిస్తున్నామని అన్నారు. రైతులకు అందించే లేఔట్ ప్లాట్ లలో అంతర్గత రోడ్లు, స్ట్రీట్ లైట్ , విద్యుత్ సరఫరా పనులు వేగవంతం చేయాలని అన్నారు. రైతులకు లేఔట్ లో జరిగే అభివృద్ధి పనులు చూపించి రిటైనింగ్ వాల్ నిర్మాణానికి భూములు స్వచ్ఛందంగా అప్పగించేలా కృషి చేయాలని అన్నారు. లేఔట్ లో 10 మీటర్ల బ్రిడ్జి నిర్మాణం పనులకు డిజైన్ ఫైనల్ చేయాలని అన్నారు. హైదరాబాద్ లోని ప్రైవేట్ లేఔట్ తరహాలో మన లేఔట్ అభివృద్ధి చేయాలని, ఈ పనులు ఎప్పుడు పూర్తి అవుతాయో స్పష్టమైన గడువు నిర్దేశించాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం రోప్ వే నిర్మాణానికి అవసరమైన స్థలం సేకరణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. లబ్ధిదారులకు ప్రత్యామ్నాయంగా వైద్య కళాశాల సమీపంలో ప్లాట్ లను ఇస్తున్నామని, అక్కడే హై వే కూడా వస్తుందని, మంత్రి చేతుల మీదుగా పట్టాల పంపిణీ ఏర్పాట్లు చేయాలని అన్నారు. పట్టాల పంపిణీ తరువాత వెంటనే పర్యాటక శాఖకు స్థలం బదలాయించాలని అన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం కోసం అవసరమైన భూ సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జాతీయ రహదారుల ఎంట్రీ, ఎగ్జిట్, సర్వీస్ రోడ్ల నిర్మాణం జరగాలని అన్నారు. ఈ సమావేశంలో నీటి పారుదల శాఖ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, నేషనల్ హైవే మేనేజర్ దివ్య, ఖమ్మం అర్బన్, రూరల్ తహసీల్దార్లు సైదులు, రాంప్రసాద్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## దుర్గం గొల్లగూడెం ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఐటిడిఏ పివో రాహుల్





**దమ్మపేట ,జూలై 30మహా:** మండలంలోని దుర్గం గొల్లగూడెం ఆశ్రమ పాఠశాల ను బుధవారం గిరిజన అభివృద్ధి శాఖ భద్రాచలం ప్రాజెక్ట్ ఆఫీసర్ బి. రాహుల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు పాఠశాలలో పరిసరాలను పర్యవేక్షణ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనంలో పాల్గొని భోజన నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కిచెన్, డార్మిటరీ, తరగతి గదులు, శుభ్రత పరిస్థితులు మొదలైన అంశాలను సమగ్రంగా పరిశీలిం చారు. విద్యార్థులతో స్వయంగా సంభాషించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. విద్యార్థుల నైతిక విలువలు, ఉత్సాహం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల నిర్వహణ పట్ల మంచి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో వనమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ రాహుల్ స్వయంగా మామిడి మొక్కను నాటి, పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. "పచ్చదనం ఉన్న ప్రపంచమే భవిష్యత్ తరాల జీవనదారి" అనే సందేశాన్ని అందిస్తూ, విద్యార్థులను మొక్కలు నాటే కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని ప్రోత్సహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థిని విద్యార్థులకు చదువుతోపాటు వారికి ఇష్టమైన కళల పట్ల మక్కువ కలిగించి వారిలో దాగివున్న ప్రతిభా పాట వాలను, నైపుణ్యాలను వెలికి తీసే విధంగా సంబంధిత ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీలు ఈ సంవత్సరం ప్రతిరోజు బోధించే పాఠ్యాం శాలతో పాటు అదనంగా విద్యా ర్థులకు ఇష్టమైన వ్యాసరచన, క్విజ్, నాటికలు, ఏకపాత్రాభినయానికి సంబంధం చిన కళల పట్ల అవగాహన కల్పించాలని ఉపాధ్యా యులకు సూచించారు. వాటికి సంబంధించిన ప్రణాళికలు రూపొందించి అన్ని పాఠశాలలకు పంపిస్తామని ఉపాధ్యాయులు తప్పనిసరిగా ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.

# సరోగసీ చట్టం కఠినంగా అమలు

**అక్రమాలు దొరికితే కఠిన చర్యలు... నిబంధనలకనుగుణంగా ఎఆర్‌టి సేవలు అందించాలి**

**పతినెల నివేదికలు సమర్పించాలి... జిల్లా వైద్య విద్యాధికారి కళావతి భాయ్**

**ఖమ్మం, మహా:** సరోగసీ కేంద్రాలలో అక్రమాలు జరిగితే చట్టాన్ని కఠినంగా అమలు చేస్తామని జిల్లా వైద్య విద్యాధికారి కళావతి భాయ్ స్పష్టం చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సంతాన సాఫల్య కేంద్రాలపై పకడ్బందీ పర్యవేక్షణ కొనసాగుతోందనీ బుధవారం వారు తెలిపారు. అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ (%ూ=ు%) మరియు సరోగసీ చట్టాలకు అనుగుణంగా సేవలు అందించాల్సిన బాధ్యతతో ఈ కేంద్రాలు పనిచేయాల్సిన అవసరం ఉందని, గోప్యత, నైతికత, వైద్య ప్రమాణాలకు ప్రాముఖ్యత ఇవ్వాల్సిన అవసరం ఉన్నదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, ప్రజల హక్కులు రక్షించేందుకు తాము అప్రమత్తంగా ఉన్నామని తెలిపారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి. కళావతిబాయి సమర్పించిన తాజా వివరాలు ప్రకారం జిల్లాలో ఇప్పటివరకు 7 ఏ ఆర్ టి కేంద్రాలు, 2 సర్రోగసీ కేంద్రాలు నిబంధనలతో పనిచేస్తున్నాయని, వాటిపై రాష్ట్ర స్థాయి నుంచి కూడా నిరంతర తనిఖీలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వానికి అనుగుణంగా అమలవుతున్న అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ రెగ్యులేషన్ యాక్ట్, 2021 మరియు సర్రోగసీ రెగ్యులేషన్ యాక్ట్, 2021 ప్రకారం, జిల్లాలోని అన్ని %ూ=ు% క్లినిక్‌లు, సర్రోగసీ కేంద్రాలు



కచ్చితంగా చట్టాన్ని గౌరవిస్తూ పనిచేయాలన్నది అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ కేంద్రాల ద్వారా సేవలు పొందే దంపతుల ఆరోగ్య సమాచారం, వారి వ్యక్తిగత వివరాలు, చికిత్సలకు సంబంధించిన మానవీయ అంశాలు పూర్తిగా గోప్యంగా ఉంచాలన్న నిబంధనలు అమలులో ఉన్నాయని డా. బి. కళావతిబాయి తెలిపారు.

"దంపతుల గోప్యతను రక్షించడమే ఈ చట్టాల ముఖ్య ఉద్దేశం. ఈ నిబంధనలను ఉల్లంఘించే ఏ సంస్థ అయినా ఖండనీయమే. అవసరమైతే రిజిస్ట్రేషన్ రద్దు వరకు చర్యలు తీసుకుంటాం" అని ఆమె హెచ్చరించారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో 7 ఏఆర్టి క్లినిక్లు, 2 సర్రోగసీ సెంటర్లు చట్టబద్ధంగా నడుస్తున్నాయని, ఇవన్నీ రాష్ట్ర ఆరోగ్య కమిషనర్ ఆధ్వర్యంలో నెలనెలా నివేదికలు సమర్పిస్తున్నాయని ఆమె వివరించారు. వీటిని జిల్లా స్థాయిలోని వైద్య ఆరోగ్య విభాగం గమనిస్తూ, అవసరమైతే అకస్మిక తనిఖీలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రాలకు వెళ్లే ముందు ప్రజలు జాగ్రత్తగా ఆలోచించి, అక్కడ పనిచేసే వైద్యుల నైపుణ్యం, పూర్వ విజయాల శాతం, క్లినిక్ రిజిస్ట్రేషన్ వివరాలు, చట్టానికి అనుగుణంగా ఉన్నత ప్రమాణాలు పాటిస్తున్నాయా లేదా అనే విషయాలను నిర్ధారించుకోవాలన్నారు. "సేవలు పొందే ముందు మరియు సరోగసీ చట్టాల్లోని నిబంధనలు సవివరంగా తెలుసుకోవడం దంపతుల హక్కు కూడా" అని ఆమె పేర్కొన్నారు. అలాగే, కొన్ని సందర్భాల్లో ఒంటరిగా సంతానాన్ని పొందాలనుకునే మహిళలు, సముదాయానికి చెందిన వారు కూడా ఈ కేంద్రాల్లో వైద్య సేవలు పొందుతారని, వీరి గోప్యత మరియు మానవీయ హక్కులను మరింత బాధ్యతతో పరిరక్షించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

## ప్రజల జీవనోపాధికి ఏం చర్యలు చేపడుతున్నారు..?

**ఖమ్మం, మహా:** బొగ్గు గనులు మూసేసిన ప్రాంతాల్లో అక్కడ నివసిస్తున్న ప్రజల జీవనోపాధికి ఏం చర్యలు చేపడుతున్నారు..? అని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి లోక్ సభలో కోరారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా బుధవారం.. మూడు ప్రశ్నలు



అడిగారు. బొగ్గు గనులకు సంబంధించి జస్ట్ ట్రాన్సిషన్ పనితీరును మెరుగుపరచడానికి తీసుకున్న చర్యలు, మరో రెండు ప్రశ్నల్లో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల వివరాలు, జాతీయ ఆహార భద్రతా చట్టం అమలు తీరు, రేషన్ కార్డుల జారీ వివరాలు కోరారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి జి. కిషన్ రెడ్డి, విద్యుత్, కొత్త పునరుత్పాదక ఇంధనం శాఖల సహాయ మంత్రి శ్రీపాద్ యశో నాయక్, కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖల సహాయ మంత్రి నిముబెన్ జయంతిభాయ్ బాంభణియా లు లిఖితపూర్వక సమాధానాలు ఇచ్చారు. ఈ ఏడాది జనవరి 31న జారీ చేసిన మైనింగ్ ప్లాన్, గనుల మూసివేత మార్గదర్శకాల ప్రకారం.. ప్రభావిత కుటుంబాల కోసం పునరావాసం చర్యలు చేపడుతున్నామని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. కార్మికులు, సంఘాలు మరియు పర్యావరణం పై ప్రతికూల ప్రభావాలు తగ్గించే ట్రాన్సిషన్ విధానాన్ని సమర్థంగా నిర్వహిస్తున్నామన్నారు.

## సాంఘిక సంక్షేమ గురుకులంలో ఆకస్మిక తనిఖీ

**మధిర, మహా:** మధిర మండలం కృష్ణాపురంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల/కళాశాలలో ముదిగొండ మండల అభివృద్ధి అధికారి కిషోర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, వసతి, భోజనం, పరిశుభ్రత, వైద్య సదుపాయాలను నిశితంగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కాంట్రాక్టర్ల వద్ద సమాచారం తీసుకుని మరికొన్ని సూచనలు చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ కనగాల శ్రీనివాస్ రావుతో మాట్లాడారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ ఉత్తర్వులను పాటిస్తూ విద్యార్థులకు అందుబాటులో ఉండే సదుపాయాలను మెరుగుపరచాలని సూచించారు.



## ఖమ్మంలో మాజీ ఎంపీ నామ విస్తృత పర్యటన

**ఖమ్మం అర్బన్, మహా:** బిఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు బుధవారం ఖమ్మం నగరంలో విస్తృతంగా పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



ముందుగా విడివోస్ కాలనీ వాస్తవ్యులు తెలంగాణ ఉద్యమకారులు దోకుపర్తి సుబ్బారావు కుమార్తె వివాహం ఇటీవల జరుగగా వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తెలంగాణ ఉద్యమకారులు నెల్లూరి అచ్యుతరావు, పగడాల నరేందర్, జడల వెంకటేశ్వర్లు, మరికంటి రేణుబాబు, మందడపు శంకరరావు, ఆసిఫ్ అహ్మద్, బురాన్, లింగన్న బోయిన సతీష్ తదితరులు హాజరైనారు. అక్కడ నుండి ఖమ్మం పట్టణ బిఆర్ఎస్ నాయకులు గొడ్డేటి మాధవరావు మనవడు బారసాల, నామకరణ వేడుక ఇటీవల జరిగిన సందర్భంగా వారి కుమార్తె సాయిసుధ-వెంకటేష్ దంపతుల కుమారుడు చిరంజీవి తన్విక్ ఆర్యన్ ఆశీర్వాదించారు.

## మాజీ ఎంపీ నామ చేతుల మీదుగా నూతన ఫార్మా రిటైల్ అవుట్‌లెట్ ప్రారంభం

**ఖమ్మం అర్బన్, మహా:** ఖమ్మం నగరం, మయూరి సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎలైట్ ఎస్2 ఫార్మా హోల్‌సేల్-రిటైల్ ఫార్మా అవుట్‌లెట్ ను బుధవారం నాడు బిఆర్ఎస్



మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ లోక్‌సభ సభ్యులు నామ నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకట వీరయ్య, మాజీ డీసీసీబీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు, ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎలైట్ ఎస్2 ఫార్మా సిబ్బందితో పాటు బిఆర్ఎస్ నాయకులు కనకమేడల సత్యనారాయణ, బిఆర్ఎస్ వైరా రూరల్ మండల పార్టీ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ దండా జ్యోతిరెడ్డి, నాయకులు మోతారపు సుధాకర్, మోరంపూడి ప్రసాద్ రావు, బత్తుల శ్రీనివాసరావు, గొడ్డేటి మాధవరావు, మరికంటి రేణుబాబు, వాకదాని కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆదరణ

**ఖమ్మం రూరల్, మహా:** ఏదులాపురం మున్సిపాలిటీ ప్రజల కష్టసుఖాల్లో అండగా నిలవడం ఒక నిజమైన ప్రజానాయకుడి లక్షణమని మరోసారి చాటారు



తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి. ఆయన సూచనల మేరకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేయడం జరిగింది.

## టేకులపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్

**ఖమ్మం అర్బన్, మహా:** టేకులపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ప్రస్తుతం విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్లో తక్షణ ప్రవేశాలు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ ఎం. సునీత తెలిపారు. ఖాళీగా ఉన్న ఎంపీసీ, బైపిసి గ్రూపుల్లో ఎంపికైన వారికి సీట్లు కేటాయిస్తామని తెలిపారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించి ఉండాలి, ఈనెల 31న ఉదయం 9 గంటలకు నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు అసలు ధ్రువీకరణ పత్రాలు , మూడు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, మూడు సెట్లు జిరాక్సులతో టేకులపల్లి గురుకుల సాంఘిక సంక్షేమ కళాశాల నందు హాజరుకావాలని తెలిపారు అదేరోజు సాయంత్రం నాలుగు గంటలకు అర్హుల జాబితా ప్రదర్శిస్తామని తెలిపారు .

మహా పత్రిక
ANN తెలుగు

## కస్తూరిబా గాంధీ స్కూల్లో వైద్య శిబిరం



**టేకులపల్లి - మహా :** టేకులపల్లి లోని కస్తూరిబా గాంధి విద్యాలయంలో మండల డాక్టర్ కందుల దినేష్ నేతృత్వంలో వైద్య శిబిరం నిర్వహించి 26 మంది బాలికలకు చికిత్సను అందించారు ఈ సందర్భంగా బాలికలతో ఏర్పాటుచేసిన సమావేశంలో వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత సీజనల్ వ్యాధులు రక్తహీనతపై అవగాహన కల్పించారు ఎట్టి పరిస్థితుల్లో ఒకరి వస్తువులు మరొకరు ఉపయోగించరాదని ప్రతి ఒక్కరికి రోజు విడిచి రోజు వాడుకోవడానికి విధిగా రెండు టవల్స్ మరియు రెండు పిల్లో కవర్స్ ఉండాలని తడిగా ఉన్న బట్టలు ధరించరాదని, ఎలర్జీ లక్షణాలు ఉన్నపిల్లల బట్టలను డెటాల్ కలిపిన నీటిలో 15 నిమిషాలు ఉంచి బాగా ఎండిన తర్వాత వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణా అధికారి దేవా సూపర్వైజర్ గుజ్జా విజయ, ఏఎన్ఎంలు సులోచన చంద్రకళ ప్రిన్సిపల్ సంతు సీతాదేవి ఉపాధ్యాయ సిబ్బంది ఆశా కార్యకర్తలు మజహరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## ఐఐటి కి ఎంపికైన అంకంపాలెం విద్యార్థినిని సన్మానించిన ఐటిడిఎ పిఓ రాహుల్



**దమ్మపేట ,జూలై 30 మహా :** అంకంపాలెం ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి లో వందశాతం ఉత్తీర్ణతో మండలంలోని ప్రైవేటు పాఠశాల విద్యార్థులను అధిగమించి అత్యధిక మార్కులు సంపాదించి రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందింది. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు పోటీపడే బాసర ఐఐటీకి అంకంపాలెం ఆశ్రమ పాఠశాల విద్యార్థిని కావ్య ఐఐటీలో సీటు సంపాదించింది. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో రాహుల్ అంకంపాలెం ఆశ్రమ పాఠశాల విద్యార్థినికి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపి ఆశ్రమ పాఠశాలలో చదివి పదవ తరగతి ఉత్తమ ఫలితాలతో పాటు ఐఐటీకి సెలెక్ట్ అవడం చాలా సంతోషకరమని కావ్య కు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, రెండు సంవత్సరాలలో ఆ విద్యార్థినికి లాప్టాప్ ఇస్తానని విద్యార్థినికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీడీ మణెమ్మ ,ఏ టి డి ఓ .చంద్రమోహన్, ప్రధానోపాధ్యాయురాలు శారద, వార్డెన్ నాగమణి పాల్గొన్నారు.

## అర్చక వెల్ఫేర్ బోర్డు నుండి నారాయణస్వామిని తొలగించాలి



**ఖమ్మం సిటీ, మహా:** ధూప దీప నైవేద్య అర్చకుల తరఫున అర్చక వెల్ఫేర్ బోర్డు సభ్యుడిగా కొనసాగుతున్న జక్కాపురం నారాయణస్వామి పదవిని రద్దు చేయాలని డిడియన్ అర్చక సంఘం డిమాండ్ చేసింది. వెల్ఫేర్ బోర్డు పేరుతో ఆయన అక్రమాలకు పాల్పడుతున్నారని తెలంగాణ రాష్ట్ర ధూప దీప నైవేద్య అర్చక సంఘం ప్రధాన కార్యదర్శి అన్నావజ్జల ప్రసాద్ శర్మ ఆరోపించారు. ప్రభుత్వం అర్చకుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన వెల్ఫేర్ బోర్డులో దాదాపు 250 కోట్ల నిధులు ఉన్నాయని, రాష్ట్రంలో అధిక శాతం అర్చకులు ధూప దీప నైవేద్య పథకానికి చెందినవారని ఆయన తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో నారాయణస్వామి అర్చక సమాఖ్యకు ఊతమిస్తూ డిడియన్ అర్చకుల హక్కులను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

## ప్రకృతి పరిరక్షణకు మొక్కలు నాటి ముందడుగు



**ఖమ్మం అర్బన్, మహా:** వన మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆరో డివిజన్ పరిధిలోని రస్తోగి నగర్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో తల్లి పేరుతో మొక్క నాటుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. హార్టికల్చర్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హార్టికల్చర్ అధికారి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తల్లి పేరు మీద కనీసం ఒక్క మొక్కను నాటి దాన్ని పెంచుకోవడం ద్వారా ప్రకృతి పరిరక్షణకు తోడ్పడాలని సూచించారు. మొక్కలు మన ఆరోగ్యానికి, వాతావరణ శుభ్రతకు ఎంతో ఉపయోగకరమని వివరించారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచేందుకు, భవిష్యత్ తరాలకు హరిత భూమిని అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

# ఖమ్మం క్రికెట్‌లో నకిలీ కోచ్ రాజ్యం

**ఖమ్మం, మహా:** తెలంగాణ రాష్ట్ర క్రీడా రంగ అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తున్నప్పటికీ, ఖమ్మం జిల్లా క్రికెట్ అకాడమీలో 30 ఏళ్లుగా అర్హతలేని కోచ్‌లు, నకిలీ సంస్థల వల్ల క్రీడాకారుల భవిష్యత్తు గాల్లో కలిసిపోయింది. ప్రతీ ఏడాది హెచ్‌సీఏ తరఫున వచ్చే లక్షలాది రూపాయల నిధులు ఆడపోగా గల్లంతవుతున్నాయి. రంజీ, స్టేట్ స్థాయి క్రికెట్‌కు ఖమ్మం నుంచి ఒక్క ఆటగాడు వెళ్లలేకపోవడం, స్థానిక రాజకీయ నాయకుల పెత్తనం, అక్రమ క్యాంపుల నిర్వహణ, నకిలీ కోచ్‌లు లక్షల్లో వసూలు చేయడం... జిల్లా స్థాయిలోనే దూకుడు చూపిన ఆటగాళ్లకు స్థానం ఇవ్వక, లంచాలు, లాబీలతో అవకాశాలు కైవసం చేసుకున్న ముఠా చేతుల్లో ఖమ్మం క్రికెట్ నలిగిపోతోంది. నిజమైన క్రీడాభిమాని తలదించుకునే పరిస్థితులు నెలకొన్నాయి.

### పేరున్నది గానీ, ఫలితాలు శూన్యం..

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఖమ్మం శాఖ పేరుతో గత ముప్పై ఏళ్లుగా ఒక్కటే కుటుంబం .. ఒక్కటే వ్యక్తి క్రికెట్ అకాడమీని ఏలుతోంది. ప్రతీ ఏడాది రాష్ట్ర హెచ్‌సీఏ నుంచి ఖమ్మం జిల్లాకు పంపే 25 లక్షల కంటే ఎక్కువ నిధులు ఖచ్చితంగా గమ్యం చేరకుండానే మాయం అవుతున్న వైనాన్ని మాజీ ఆటగాళ్లు బహిర్గతం చేస్తున్నారు. క్రికెట్ అంటే పాషన్‌తో ఎదిగిన ఎంతో మంది యువతకు అవకాశాలున్నా... అవి నకిలీ కోచ్‌లు, రాజకీయ మద్దతు ఉన్న వారివల్ల నొక్కేసే పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది.

### అర్హతలేని కోచ్‌లు

ఖమ్మం స్టేడియం ప్రాంగణంలోనే 18 ఏళ్లుగా ఎటువంటి క్రికెట్ కోచింగ్ అర్హతలు లేని వ్యక్తి కోచ్‌గా కొనసాగుతూ, స్టేట్ మీట్స్ లో ఆడిస్తానని చెప్పి వేలల్లో వసూలు చేస్తున్న వైనం బయటపడింది. అలాగే, మరో నకిలీ కోచ్ స్థానిక బీఆర్ఎస్ నేతతో కలసి కే డిసిఎ పేరుతో నకిలీ క్యాంపులు నిర్వహిస్తూ స్పాన్సర్స్ నుంచి లక్షల్లో డబ్బులు గుంజుతున్నారన్న ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి.

### మోసపోయిన క్రీడాకారులు.

"30 ఏళ్లలో ఒక్క ఆటగాడినైనా రంజీ టోర్నమెంటుకు పంపలేకపోయిన అకాడమీకి ఎలాంటి నైతిక హక్కు ఉంది?" అని మాజీ క్రికెటర్ నరాల నరేష్ ప్రశ్నిస్తున్నారు. సీనియర్ క్రికెటర్ రాజశేఖర్ తీవ్రంగా స్పందిస్తూ "మేము జీవితాన్ని క్రికెట్‌కు అంకితం చేశాం. అన్ని అర్హతలున్నా, అవినీతి, కోచ్‌ల లాబీల వల్ల ఒక్క అవకాశం కూడా రాలేదు" అన్నారు. మరో కోచ్ మథిన్ మాట్లాడుతూ, ఖమ్మంలో క్రికెట్ అభివృద్ధి చెందాలంటే, ఖమ్మం శాఖను పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది అన్నారు.

బీఆర్ఎస్ హయాంలో ఏర్పడిన నకిలీ కేడిసిఎ క్యాంపులు క్రికెట్‌ను నాశనం చేశాయని క్రీడాభిమానులు వాపోతున్నారు. లక్షల్లో వసూలు చేసిన డబ్బులు ఎక్కడికెళ్లాయి అనే ప్రశ్నలకు సమాధానాలు దొరకడంలేదు. ప్రాథమిక వసతుల్లేని గ్రౌండ్లలో ఆటగాళ్లను శిక్షణ పేరుతో మోసం చేస్తున్నారు. అంతటితో ఆగకుండా, ఆటగాళ్ల భవిష్యత్తును అమ్మేస్తున్నారు.

### మార్పు కోసం జాతీయ స్థాయిలో పిలుపు

**సంస్థాగతంగా మార్పు కోసం జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా సంఘాలు, మాజీ ఆటగాళ్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. నిజమైన కోచ్‌లకు స్థానం కల్పించి, అర్హులైన క్రీడాకారులకు అవకాశాలు ఇవ్వాలని, అకాడమీ నిధులు క్రీడాకారుల అభివృద్ధికే వినియోగించాలన్నది వారి ప్రధాన డిమాండ్.**

## జిల్లా పశువైద్యశాలలో కమిషనర్ పర్యటన



**ఖమ్మం, మహా:** ఖమ్మం నగరంలోని జిల్లా పశు వైద్యశాల ను మున్సిపల్ కమిషనర్ శ్రీ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. పశువులకు అందిస్తున్న వైద్య సేవలను, ఆరోగ్య సంరక్షణ విధానాలను కమిషనర్ సమీక్షించారు. జంతువులకు జరుగుతున్న చికిత్సలను దగ్గర నుండి పరిశీలించి, వైద్యుల నైపుణ్యాన్ని ప్రశంసించారు.వైద్యశాలలో అందుబాటులో ఉన్న వసతులు, మందుల నిల్వలు, అత్యవసర చికిత్స పరికరాల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా శానిటేషన్ పై దృష్టి సారించిన ఆయన, శుభ్రత స్థాయిపై పరిశీలన చేసి తగు సూచనలు చేశారు. భవనం మరమ్మతులు, అభివృద్ధి పనులను పరిశీలిస్తూ నిర్మాణ నాణ్యతపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, "జంతువుల ఆరోగ్యం గ్రామీణ ఆర్థికవ్యవస్థకు వెన్నుదన్ను లాంటిది. సరైన వైద్య సేవలు అందించడమే మున్సిపల్ పాలనలో ఒక ముఖ్య బాధ్యత" అని పేర్కొన్నారు. పశు వైద్యశాలలో సేవల మెరుగుదల కోసం అవసరమైన మౌలిక వసతులు, మానవ వనరుల విషయాల్లో తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. పర్యటనలో జిల్లా పశువైద్యాధికారి, వైద్య సిబ్బంది, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. కమిషనర్ సూచనలు, ఆదేశాల మేరకు తక్షణమే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులు తెలిపారు.

## మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 30 (మహా):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం తోగ్గూడెం మిషన్ భగీరథ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను బుధవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పరిశీలించి ప్రతి ఇంటికి నాణ్యమైన తాగునీరు చేరేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన ప్లాంట్ లో గ్రిడ్ నుండి నీటి ప్రవాహం, నీటి నిల్వ సామర్థ్యం, రోజువారి మండల డిమాండ్, గ్రామాల వారిగా నీటి సరఫరా స్థితిగతులను తదితర అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్లో వివిధ దశల్లో అమలవుతున్న నీటి శుద్ధి ప్రక్రియను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. ప్రతి దశలో చేపడుతున్న పరీక్షలు, శుద్ధీకరణ పద్ధతులు మరియు ల్యాబ్ పరీక్షల ప్రమాణాలను గురించి అధికారులను వివరంగా అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ నిర్వహణలో ఉన్న సాంకేతిక పరికరాలు, ఫిల్టర్ల పనితీరు మరియు కెమికల్ డోసింగ్ గురించి పరిశీలించారు.



# జిల్లాలో ఆర్టిఐ అమలుపై రాష్ట్ర కమిషనర్ల పర్యటన

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 30 (మహా):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ) అమలు పరిస్థితిని సమీక్షించేందుకు రాష్ట్ర ముఖ్య సమాచార కమిషనర్లు పి.వి. శ్రీనివాసరావు, దేశాల భూపాల్ మరియు బోరెడ్డి అయోధ్య రెడ్డి జిల్లా పర్యటనకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు రోజుల పర్యటనలో భాగంగా, నేటి ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అన్ని శాఖల ప్రజా సమాచార అధికారులు (పిఐఒలు) మరియు అప్పిలేట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించబడుతుందని, అలాగే మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అప్పీలు దారులతో విచారణ కలెక్టర్ పేర్కొన్నారు. ఆగస్టు 1 శుక్రవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు మరో విడత ఆర్టీఐ అప్పీల్ విచారణలు జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో



నిర్వహించబడతాయని వివరించారు. ఈ సందర్భంగా, అన్ని శాఖల పి ఐ ఓ లు మరియు అప్పిలేట్ అధికారులు 6(1) కింద దాఖలైన ఆర్టీఐ దరఖాస్తుల రసీదులు, ప్రశ్నలు, సమాధానాలు, అవసరమైన పాయింట్‌వారీ కౌంటర్ సమాచారంతో విచారణలకు తప్పకుండా హాజరుకావలసినదిగా కలెక్టర్ ఆదేశించారు. అన్ని విభాగాల పి ఐ ఓలు మరియు ఏ ఏ లు ఇంటరాక్షన్ సెషన్‌కు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. సమాచార హక్కు చట్టం అమలులో పారదర్శకత పెంపొందించడంలో భాగంగా, ప్రతి కార్యాలయంలో ఆర్టీఐ బోర్డులను మార్గదర్శకాల ప్రకారం నవీకరించి, ప్రదర్శించాలనీ, ఇందుకు తగిన చర్యలు వెంటనే చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## కొత్తగూడెం గ్రంధాలయంలో వైఫై సేవలు

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 30 (మహా):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని నూతన గ్రంథాలయంలో వైఫై సేవలు అందుబాటులోకి వచ్చాయి. పోటీ పరీక్షలకు సిద్ధపడే వారు, పాఠకుల కోసం ఈ వైఫై సేవలను గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు



బుధవారం సమకూర్చారు. వైఫై సదుపాయం లేక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో విద్యార్థులు పాఠకులు చైర్మన్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన గ్రంథాలయంపై ఆధారపడి చదువుకునే వారి కోసం అప్పటికప్పుడే వైఫై సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. సమస్యను చెప్పగానే సహృదయంతో అర్థం చేసుకొని వైఫై సౌకర్యాన్ని కల్పించిన చైర్మన్ వీరబాబుకు గ్రంథ పాలకురాలు జి మణిమృదుల విద్యార్థినీ విద్యార్థులతో పాటు పాఠకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన పోలీస్ కమిషనర్

**ఖమ్మం, మహా:** నగరంలోని ప్రకాష్ నగర్ లో గల పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ, పనితీరు పరిశీలించారు.రోడ్ల మరమ్మత్తులు, వర్షాలతో దెబ్బతిన్న సీసీ కెమెరాలను



వెంటనే పునరుద్ధరించాలని సూచించారు. నేరాల నియంత్రణలో కీలకంగా పనిచేస్తున్న సీసీ కెమెరాల ఏర్పాటు పై పోలీస్ స్టేషన్ వారిగా పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

## 19 వందల మంది న్యాయవాదులను తక్షణమే నోటరీలుగా నియమించాలి

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 30 (మహా):** 2021లో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నోటరీ నోటిఫికేషన్ ద్వారా తెలంగాణ రాష్ట్రంలో దరఖాస్తు చేసిన 1,900 మంది న్యాయవాదులను తక్షణమే నోటరీలుగా నియమించాలని బుధవారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు యన్. రామచంద్రరావుకు ఐ.ఎల్.పి.ఏ. జిల్లా కన్వీనర్ జనపరెడ్డి గోపికృష్ణ కోరారు. కొత్తగూడెం బార్ అసోసియేషన్ లైబ్రరీ హాల్‌లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న




రామచంద్రరావుకు ఐ.ఎల్.పి.ఏ. జిల్లా కమిటీ కన్వీనర్ జనపరెడ్డి గోపికృష్ణతోపాటు న్యాయవాదులు సుంకర భానుప్రియ, మహమ్మద్ సాదిక్ పాషా, యన్. ఉషారాణి, వడ్లకొండ హరి, దేవేంద్ర వర ప్రసాద్, అంకుష్ పాషా, వి. రాజేశ్వరరావు తదితరులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జనపరెడ్డి గోపికృష్ణ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్నా ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. కేంద్ర న్యాయశాఖ అధికారులతో చర్చించి పెండింగ్‌లో ఉన్న నోటరీలను వెంటనే భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా కొత్త నోటరీ నోటిఫికేషన్ విడుదలకు కృషి చేయాలని ఆయన తెలిపారు. అనంతరం సానుకూలంగా స్పందించిన రామచంద్రరావు, సమస్య పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారని జనపరెడ్డి గోపికృష్ణ వెల్లడించారు.

## సుజాతనగర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 30 (మహా):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సుజాత నగర్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు మరియు



సిబ్బందికి పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు,సైబర్ నేరాలపై నిత్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో లోని ప్రజలకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు.పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొబెషనరీ ఎస్ఐ ఉమ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ముఖ్యంగా బీసీలను మోసం చేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు ఘాటు విమర్శలు చేశారు. మంగళవారం రాత్రి కొత్తగూడెం క్లబ్ ఆవరణంలో బీజేపీ నిర్వహించిన స్థానిక సంస్థల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షత వహించారు. రాష్ట్రంలోని బీసీ కులాలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని, బీసీలకు న్యాయం



చేయలేకపోతూ కేంద్ర ప్రభుత్వంపై నిందలు మోపటం అసంబద్ధమని రామచంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. "బీసీ కులగణన పేరుతో ముస్లింలను బీసీ జాబితాలో చేర్చే ప్రయత్నాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ఇది బీసీలకు తీవ్ర అన్యాయం" అని వ్యాఖ్యానించారు. తెలంగాణకు కేంద్రం నిధులు మంజూరు చేయడం లేదన్న కాంగ్రెస్ ఆరోపణలను ఖండించిన రామచంద్రరావు, "ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో పేదల ఇళ్ల నిర్మాణానికి కోటానుకోటి రూపాయలు విడుదల చేయబడ్డాయి. వాటిని 'ఇందిరమ్మ ఇళ్లు' పేరిట రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను తప్పుదారి పట్టిస్తోంది" అన్నారు. అటల్ బిహారీ వాజపేయి హయాంలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వ విధానాన్ని గుర్తు చేస్తూ, "బీజేపీ ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉంది. కానీ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కుల రాజకీయాలకు పాల్పడుతోంది" అని విమర్శించారు.

## సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని జవాన్ ఆత్మహత్య

**మహా భద్రాచలం:** ఛత్తీస్ ఘడ్ బీజాపూర్ జిల్లా,నేమేడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మింగాచల్ సి ఆర్ పి ఎఫ్ 22 క్యాంపులో పనిచేస్తున్న జవాన్ ..పప్పు యాదవ్ తన సర్వీస్ రివాల్వర్ తో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్య గల కారణాలు తెలియాల్సి ఉంది. కాగా అధికారులు జవాన్ ఆత్మహత్య పై విచారణ చేపడుతున్నారు.



FOLLOW: @ANNTELUGU
31-7-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

## మందుపాతర అమరుస్తూ పట్టుబడ్డ ఆరుగురు మావోయిస్టు లు



**మహా భద్రాచలం:** మావోయిస్టు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సమయంలో ఎలాగైనా పోలీసులను మట్టు బెట్టాలని మందు పాతర అమరుస్తూ ఆరుగురు మావోలు భద్రతా బలగాలకు చిక్కారు. ఛత్తీస్ ఘడ్ బీజాపూర్ జిల్లా,బాసగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మా పూర్ అటవీ ప్రాంతంలో పోలీసులను లక్ష్యంగా చేసుకుని మందు పాతరలను అమరుస్తున్న ఆరుగురు మావోయిస్టులను బలగాలు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి టిఫిన్ బాంబులు,డిటోనేటర్లు,కార్డెక్స్ వైర్ మరియు పేలుడు పదార్థాలు కోబ్రా 210 బెటాలియన్ కు చెందిన పోలీసులు స్వాదీనం చేసుకున్నారు.

## పారిశుద్ధ్యం పట్ల అవగాహన కల్పించాలి



**నేలకొండపల్లి, జులై 30 మహా:** పారిశుద్ధ్యం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని ఖమ్మం డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు హెచ్చరించారు. మండలం లోని కోనాయిగూడెం లో బుధవారం పర్యటించారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. వర్షాకాలం సీజన్ లో తీసుకోవాల్సిన జాగ్రత్తల ను వివరించారు. ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ప్రతీ ఇంటిని సందర్శించి నిల్వ ఉన్న నీటి వలన జరిగే ప్రమాదాలను వివరించాలని సూచించారు. పారిశుద్ధ్యం పై అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలని అన్నారు. సిబ్బందితో పనులు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీఓ యం.యర్రయ్య స్థానిక గురుకుల బాలికల పాఠశాల ను సందర్శించారు. వంట గదులను పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులను కలిసి పారిశుద్ధ్యం గురించి వివరించారు. సీజనల్ వ్యాధులు రాకుంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శివ, పంచాయతీ కార్యదర్శి బైరం దినేష్కుమార్, ఏఎన్యం పద్మ, ఈజీఎస్ ఎఫ్ఎ తిగుళ్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



**నేలకొండపల్లి, జులై 30 మహా :** ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు సతీష్ హెచ్చరించారు. మండలం లోని వివిధ గ్రామాలలో ఎరువుల దుకాణాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. రికార్డుల ప్రకారం స్టాక్ ఉందా లేదా అని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. డీలర్ల కు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...డీలర్లు కృత్రిమ కొరత సృష్టిస్తే సహించేది లేదని హెచ్చరించారు. డీలర్లతో పాటు సొసైటీ అధికారులు రికార్డుల నిర్వహణ ఖచ్చితంగా ఉండాలని సూచించారు. అనంతరం పైనంపల్లి లో అయిల్పామ్, వివిధ పంట క్షేత్రాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు...సాగు వివరాలు అడిగి –తెలుసుకున్నారు. వారికి తగిన సలహాలు అందించారు. సాగులో మెళుకువలను వివరించారు. నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి యం.రాధ, ఏఈవో దుర్గాభవాని, సొసైటీ సీఈవో జగదీష్, రైతులు మారగాని పద్మారావు, వెంకటేశ్వర్లు, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

## భద్రాచలంలో గ్యాస్ గోదాం తరలించండి

**భద్రాచలం, మహా:** భద్రాచలం పట్టణంలో ప్రభుత్వ పాఠశాల, నివాస ప్రాంతానికి అతి దగ్గరగా ఉన్న హెచ్‌పీ గ్యాస్ గోదాంపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రమాదకర పదార్థాల నిల్వ ఈ ప్రాంత ప్రజలకు ప్రాణహాని కలిగించే ప్రమాదముందని కమిషన్ అభిప్రాయపడింది. ప్రజల జీవించే హక్కు (ఆర్టికల్ 21) ఉల్లంఘన జరిగిందని పేర్కొంది. కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ ఆ గోదాంను అక్కడి నుంచి తరలించాలని పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు రెండు నెలల్లో చర్యలు తీసుకోవాలని సూచించింది.

# బీసీల హక్కులకు కాంగ్రెస్ తూట్లు



**ఇల్లందు, మహా:** ఉగ్రవాదాన్ని పెంపొందిస్తున్న పాకిస్తాన్‌కు అనుకూలంగా మాట్లాడే కాంగ్రెస్ నేతలు, బీఆర్ఎస్ నాయకులు దేశం పట్ల చిత్తశుద్ధి లేని వారి అసలైన మానసిక దృక్పథాన్ని బహిరంగపరుస్తున్నారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్ర రావు తీవ్రంగా విమర్శించారు. ఇల్లందు లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ పట్ల రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు సైనికుల త్యాగాలను అవమానించేలా ఉన్నాయని, బీజేపీ పట్ల వ్యతిరేకతతోనే ఆయన ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. దేశ భద్రతకు సంబంధించి పార్టీ విధానాలు, జాతీయ ప్రయోజనాల కన్నా కాంగ్రెస్‌కు రాజకీయ లబ్ధే ముఖ్యమని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం ఓబీసీలను బాధపెడుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్‌లో 10 శాతం ముస్లింలకు కేటాయించడం ద్వారా అసలైన ఓబీసీలకు గాలికొదలైన హక్కులు మిగలకుండా చేస్తున్నారని విమర్శించారు. కేవలం మతపరమైన, రాజకీయ ప్రయోజనాల కోసమే బీసీ రిజర్వేషన్ బిల్లును తెరపైకి తెచ్చారని ఆరోపించారు. “రాష్ట్రంలో బీజేపీకి అవకాశం ఇవ్వండి%8%% బీసీలకు పెద్దపీట వేస్తాం. న్యాయం చేస్తాం” అంటూ రాష్ట్ర అధ్యక్షుడిగా హామీ ఇచ్చారు. బీసీల సమస్యలపై బీజేపీ నిరంతరం పోరాడుతుందని హామీ ఇచ్చారు. ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో బీజేపీని బలోపేతం చేయడమే తన పర్యటనల ముఖ్య ఉద్దేశమని రామచంద్ర రావు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పటికే సీపీఎం క్యాడర్ బీజేపీ వైపు మొగ్గు చూపుతోందని వెల్లడించారు. ఖమ్మం ప్రాంతాన్ని బీజేపీ అడ్డాగా మార్చేందుకు పార్టీ కృషి చేస్తున్నదని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ తుఫాన్‌లా దూసుకెళ్తుందని, ప్రజలు తాము చేస్తున్న పరిపాలనకు బ్రహ్మరథం పట్టనున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు వంచన చేస్తున్నప్పుడు, కేంద్ర బడ్జెట్ ద్వారా బీసీల విద్య, ఉపాధికి విశేష నిధులు కేటాయిస్తూ ప్రధాని మోదీ ప్రభుత్వం సేవలందిస్తోందని గుర్తుచేశారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షురాలు సుచిత్ర పాసి, మండల అధ్యక్షుడు బట్టు రమేష్, నాయకులు మురళీకృష్ణ, గోపికృష్ణ, మాధవ్, నాగన్న, శాసనాల రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# ముంపు ముంచుకొస్తున్నా మేల్కొనని కాంగ్రెస్ పాలకులు



**మహా భద్రాచలం:** ఓవైపు ముంపు ముంచుకొస్తున్నా కాంగ్రెస్ పాలకులు మేల్కోనకుండా మీనమేషాలు లెక్కపెట్టడం సరైనది కాదని పోలవరం ప్రాజెక్టుతో భద్రాచలానికి వచ్చే ముంపుపై అఖిలపక్షాన్ని కలుపుకొని కార్యచరణ రూపొందించాలని, భద్రాద్రి రామయ్యను ముంచుతూ మరోవైపు దొంగ దండాలు పెడుతున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ముందు ఐదు పంచాయతీలను తెలంగాణలో కలిపి రామయ్య భూములకు శాశ్వత పరిష్కారం చూపాలని సిపిఐఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు హితవు పలికారు. బుధవారం సిపిఐ ఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కరకట్టరక్షణ, పోలవరం ముంపు అధ్యయన యాత్రలో మచ్చ వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. కరకట్ట రక్షణ గోడ కూలి నెలరోజులవుతున్న తాజా మాజీ ఎమ్మెల్యేలు గాని, ఎంపీ మంత్రులు గాని సందర్శించకుండా పదవుల కోసం కొట్టుకోవడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఓవైపు పోలవరంతో భద్రాద్రి రామయ్యను ముంచుతూ మరోవైపు దొంగ దండాలు పెడుతూ మోసకారి పర్యటన మానుకోవాలని హెచ్చరించారు. ఐదు పంచాయతీలను భద్రాచలంలో కలపడం ద్వారా రామయ్య భూములకు శాశ్వత పరిష్కారం దక్కుతుందన్న విషయం తెలిసినప్పటికీ విభజన పేరుతో చిచ్చురేపి ఇప్పుడు రామయ్య భూములపై బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ముసలి కన్నీరు కార్చితే ఇక్కడ ప్రజలు నమ్మరని స్పష్టం చేశారు. పోలవరం బ్యాక్ వాటర్ తో భద్రాచలానికి కలిగే ముంపుకి కాంగ్రెస్, బిజెపి పార్టీలే బాధ్యత వహించాలని కరకట్ట పునర్ నిర్మాణంలో నిర్లక్ష్యం వహిస్తున్న ఆయా పార్టీలకు ఇక్కడి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రాష్ట్రంలో 9 ఏళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ సైతం భద్రాచలానికి తీవ్ర అన్యాయం చేసిందని కరకట్ట నిర్మాణానికి 2000 కోట్ల నిధులు కేటాయిస్తామని కెసిఆర్ ఇక్కడ ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. భద్రాద్రి రామయ్య తో పాటు ఇక్కడ ప్రజలను ముంచే పాపం కాంగ్రెస్ బిజెపి టిఆర్ఎస్ పార్టీలకు తప్పక తగులుతుందని మచ్చ స్పష్టం చేశారు. సిపిఐ ఎం ఆధ్వర్యంలో ముంపు అధ్యయన యాత్ర పేరుతో కుప్పకూలిన రక్షణ గోడ నుండి సుభాష్ నగర్ ప్రాంతం వరకు పర్యటన నిర్వహించి లోతట్టు ప్రాంత ప్రజలతో మమేకమై వారి సమస్యలను చర్చించామని అన్నారు. వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కరకట్ట పునర్ నిర్మాణ పనులు చేపట్టకపోతే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నామని సుభాష్ నగర్ కాలనీ వద్ద నిర్మిస్తున్న కరకట్ట పనులు వేగవంతంగా పూర్తి చేయాలని లేని పక్షంలో ఆగస్టులో గోదావరి వరద రూపంలో పెనుప్రమాదం సంభవించే అవకాశం ఉందని దానికి కాంగ్రెస్ బిజెపి పాలకులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ అధ్యయన యాత్ర ప్రారంభ సభకు పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షత వహించగా రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రంశెట్టి వెంకట రామారావు పారిల్లి సంతోష్ కుమార్ డి సీతాలక్ష్మి పట్టణ కమిటీ సభ్యులు నాదెండ్ల లీలావతి, ఉస్తేల జ్యోతి, బెల్లంకొండ కుసుమ, నకిరేకంటి నాగరాజు, ధనకొండ రాఘవయ్య, జీవనజ్యోతి,చాట్ల శ్రీనివాసరావు అజయ్ కుమార్, కుంజా శ్రీనివాస్,సంద్ర భూపేంద్ర, డివైఎఫ్ఐ అధ్యక్షులు దారిశెట్టి సతీష్ బాబు, మాజీ డివైఎఫ్ఐ నాయకులు అన్నం వెంకట్ యాత్రకు సంఘీభావం తెలిపారు. శాఖ కార్యదర్శులు గోవర్ధన్ ఝాన్సీ, డి రామకృష్ణ,పుణ్యావతి, ఎస్ఎఫ్ఐ నాయకులు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు...

మహా పత్రిక
ANN తెలుగు

# కొత్తగా 16లక్షల మందికి రేషన్ లబ్ది

**నేలకొండపల్లి, జూలై 30 మహా :** ఇందిరమ్మ ప్రభుత్వం లో కొత్తగా 16 లక్షల మందిని పాత కార్డులలో చేర్పించినట్లు రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో కొత్త రేషన్కార్డుల పంపిణీ కార్యక్రమం ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... తెలంగాణ లో ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిన తరువాత పేదల ముఖంలో సంతోషం కనిపిస్తుందని అన్నారు. ప్రజల దీవెనలతో ఇందిరమ్మ ప్రభుత్వం పాలన కొనసాగుతుందని అన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల లో ఒక్క రేషన్ కార్డు కూడ ఇవ్వలేదని అన్నారు. ఆ ప్రభుత్వం తప్పిదాల వలన కోట్లాది మంది పేదలు ఇబ్బంది పడ్డారని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చాక లక్షల మందికి అవకాశం కల్పించిందని అన్నారు. ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీ ప్రారంభించి.. మూడు నెలలకొకసారే ఇచ్చామని అన్నారు. గతంలో రైతులకు వరి వేస్తే ఉరి అనిపించగా...ఇప్పటి ప్రభుత్వం క్వింటా కు రూ.500 బోనస్ ఇస్తుందని అన్నారు. పది నెలలో రూ.21 వేల కోట్ల రుణమాఫీ జరిపినట్లు పేర్కొన్నారు. మహిళల సంక్షేమం పై దృష్టి సారించామని, ఉఛిత బస్సు



ప్రయాణానికి రూ.5 వేల కోట్లు అదనంగా ఖనర్చు చేస్తూ భారంగా భావించటం లేదని స్పష్టం చేశారు. కోటి మంది మహిళలను కోటేశ్వర్లును చేయాలనే సంకల్పంతో ఇందిరమ్మ ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ప్రతీ సోమవారం లబ్దిదారుల ఖాతాలలో నిధులు జమ అవుతున్నట్లు తెలిపారు. మూడు విడతలలో పేద కుటుంబాలకు ఇళ్లు అందజేయనున్నట్లు హామీ ఇచ్చారు. ప్రతీ అర్హుడికి ఇళ్లు ఇచ్చే బాధ్యత నాది... పేదల ఇంటి పెద్ద కోడకులా నేను మీతో ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీఫ్ దురిశెట్టి, ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు శాఖమూరి రమేష్, జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు. భద్రయ్య, రావెళ్ల కృష్ణారావు, కొర్లకుంట్ల నాగేశ్వరరావు, పగిళ్ల పృథ్వీ, కడియాల నరేష్, – కొమ్మినేని విజయాబాబు. గుండా బ్రహ్మం. తదితరులు పాల్గొన్నారు. సానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో వనమహోత్సవంలో పాల్గొని మొక్క ను జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, భద్రయ్య, రావెళ్ల కృష్ణారావు, కొర్లకుంట్ల నాగేశ్వరరావు, పగిళ్ల పృథ్వీ, కడియాల నరేష్, కొమ్మినేని విజయ్బాబు గుండా బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో వనమహోత్సవంలో పాల్గొని మొక్క ను నాటారు..మంద్రాజుపల్లి లో పీఆర్ రహదారి, బోదులబండ, చెరువుమాధారం లో అంతర్గత సీసీ రోడ్లకు శంఖుస్థాపన చేశారు.

## ఓపెన్ స్కూల్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**నేలకొండపల్లి, జులై 30 మహా:** మధ్యలో చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్స్ ఎంతో ఉపయోగపడుతుందని ఓపెన్ స్కూల్స్ జిల్లా కో–ఆర్డినేటర్ యం.పాపారావు సూచించారు. మండల కేంద్రం లోని ఐకేపీ



కార్యాలయం వద్ద బుధవారం పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...ఓపెన్ స్కూల్స్ లో చేరిన వారు..వారి ఉపాధి మార్గాలను వదులుకోకుండా తీరిక వేళలలో చదువుకుంటూ....విద్యార్హత ను పొందవచ్చునని అన్నారు. ఐదు .సబ్జెక్లతో పదో తరగతి లేదా ఇంటర్ ఉత్తీర్ణత పొందవచ్చునని అన్నారు. 14 ఏళ్లు నిండిన వారు అర్హులని పేర్కొన్నారు. పుస్తకాలను కేంద్రం లో ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఈ నెల 31 వరకు ఆపరాధం లేకుండా ఆడ్మిషన్ పొందవచ్చునని అన్నారు. పదో తరగతి కి రూ.100, ఇంటర్ కు రూ.200 అపరాధంతో ఆగస్టు 1 నుంచి 28 వరకు అడ్మిషన్ పొందవచ్చునని అన్నారు. ఈ అవకాశం ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఐకేపీ ఏపీయం ఆర్.శ్రీనివాసరావు, సీసీ లు పెద్దపాక వెంకటేశ్వరరావు, సురేఖ, వరలక్ష్మి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

**మహా భద్రాచలం:** సమస్యలతో సతమతమవుతున్న ఉపాధ్యాయులు తమ విధినిర్వహణలను సమర్థవంతంగా నిర్వర్తించలేకపోతున్నారని, విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలు సంపూర్ణంగా పరిష్కరించి విద్యా



రంగానికి రాష్ట్ర బడ్జెట్లో 25% నిధులు కేటాయించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్పిసి) రాష్ట్ర నాయకులు బి.రాజు, జిల్లా నాయకులు ఎస్.విజయకుమార్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పిసి) చేపట్టిన ఉద్యమ కార్యచరణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 5న జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు చేపట్టిన ధర్నాను విజయవంతం చేయడానికి సన్నాహక సమావేశాన్ని టీఎస్ యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించబడిన సందర్భంగా వారు మాట్లాడుతూ..... తాము అధికారంలోకి వస్తే ప్రజాపాలన అందిస్తామని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తామని నినాదాలతో పాటుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సమస్యలపై తమ ఎన్నికల మేనిఫెస్టోలో అనేక హామీలను ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 19 నెలలు గడచినప్పటికి దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న ముఖ్యమైన అనేక సమస్యలను పరిష్కరించడంలో మాత్రం తీవ్ర జాప్యాన్ని ప్రదర్శిస్తూ మీనమేషాలు లెక్కిస్తున్నదని అన్నారు.

## పెసా గ్రామ సభలను రద్దు చేయాలి

**టేకులపల్లి - మహా :** టేకులపల్లి మండలంలో అధికారులు ఆడిందే ఆటగా పాడిందే పాటగా కొనసాగుతుందని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు మాలోత్ శివ నాయక్ అన్నారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండల అధికారులు చట్టాలను



అవమానపరిచే విధంగా ఉన్నారని గిరిజనుల హక్కులను కాలరాసే విధంగా ప్రవర్తిస్తున్నారని అటువంటి అధికారులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఎంతో విచారకరమని లేక గిరిజనులు అంటే చులకన భావన అని మండల అభివృద్ధి అధికారిని ప్రశ్నించారు. గిరిజన చట్టాలను అవమానపరిచే అధికారులు మా మండలానికి అవసరం లేదని అటువంటి వారు ఎవరైనా ఉంటే మండలం నుంచి వెళ్లిపోవాలని అంతేగాని మా గిరిజనులను మా గిరిజన చట్టాలను హేళన చేసిన అవమానపరిచిన ఉపేక్షించేది లేదని హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం జరిగిన పెసా గ్రామ సభల్లో నియమ నిబంధనలను ఉల్లంఘించి గ్రామసభ జరిపిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సిండికేటుగాళ్లు ఇచ్చిన కాసులకు కక్కుర్తి పడి ఒకరి ఇద్దరితో గ్రామసభ ముగించారని అది ఏవిధంగా చెల్లుబాటు అవుతుందని మరల గ్రామసభ నిర్వహించాలని లేనియెడల సేవల సేన సంఘం ఉద్యమాలకు దిగుతుందని హెచ్చరించారు. పెసా గ్రామసభ మరల నిర్వహించకపోతే పరిణామాలు మరోలా ఉంటాయని అన్నారు. ఏజెన్సీ చట్టాలను అవమానపరిచేలా వ్యవహరించిన అధికారులను రక్షించే విధంగా ప్రజాప్రతినిధులు ప్రయత్నించడం బాధాకరమని అన్నారు.



## నేడు జరిగే వ్యవసాయ కార్మిక సంఘం పాలేరు డివిజన్ మహాసభను జయప్రదం చేయండి

**నేలకొండపల్లి, జులై 30 మహా:** మండలంలోని బోదులబండ గ్రామంలో నేడు జరిగే వ్యవసాయ కార్మిక సంఘం పాలేరు డివిజన్ మహాసభలో వ్యవసాయ కూలీలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం పాలేరు డివిజన్ బాధ్యులు కేవీ రామిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ మహాసభకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మెరుగు సత్యనారాయణ, పొన్నం వెంకటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా నాయకులు బండి రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎర్ర శ్రీనివాసరావు, పొన్నెగంటి సంగయ్య, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, వడ్లమూడి నాగేశ్వరరావు తదితరులు హాజరవుతారన్నారు. ఈ మహాసభలో వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను రూపొందించడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీల అమలుపై రానున్న కాలంలో వ్యవసాయ కార్మికులందరినీ ఐక్యం చేసి ఉద్యమించునున్నట్లు ఆయన తెలిపారు. మహాసభలు జయప్రదం కొరకు గత అనేక రోజులుగా పాలేరు డివిజన్ వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కార్యదర్శులు దుగ్గి నరసింహారావు, పెదపాక మల్లేశ్వరరావు, ఎడ్ల తిరుపతిరావు, యలమద్ది లెనిన్, గొడవర్తి వెంకటేశ్వరరావు, గురజాల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహంలో పరిశుభ్రత పాటించాలి

**నేలకొండపల్లి, జులై 30 మహా:** ప్రభుత్వ వసతి గృహాలలో పరిశుభ్రత పాటించాలని నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు సూచించారు. మండల కేంద్రంలోని బాలికల వసతి గృహం ను బుధవారం



ఆకస్మికంగా తనీఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు. వంట గదులు, డైనింగ్ హాలు, స్టోర్ రూమ్, తాగునీటి సరఫరా, టాయిలెట్స్ లను పరిశీలించారు. ఎప్పటికప్పుడు క్లీన్ చేస్తుండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...విద్యార్థులు వసతి గృహంలో ఉంటున్నట్లు కాకుండా.. ఇంట్లో ఉన్నట్లు ఫీలింగ్ కలిగేలా పరిసరాలను ఉంచాలని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.

## అక్రమ రవాణా నిర్మూలనకు అందరి భాగస్వామ్యం అవసరం

**భద్రాద్రి కొత్తగూడెం,మహా:** ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రైల్వే స్టేషన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని "యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సంస్థ, పోలీస్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. ముఖ్య అతిథిగా హాజరైన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ గౌడ్ మాట్లాడుతూ, మానవ అక్రమ రవాణా ప్రపంచం మొత్తాన్ని కలవరపెడుతున్న అతి పెద్ద వ్యవస్థీకృత నేరంగా మారిందని, దీని నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత వహించాలని పిలుపునిచ్చారు. ప్రయాణికులు ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలని, అక్రమ రవాణాదారులు తమ లక్ష్యాలను నెరవేర్చేందుకు వివిధ రూపాల్లో మాయమాటలు, మోసాలు ఆశ్రయిస్తున్నారని సీఐ పేర్కొన్నారు. ముఖ్యంగా అపరిచితులు ఇచ్చే తినుబండారాలు, పానీయాలు వంటి వాటిని తీసుకోవద్దని స్పష్టంగా హెచ్చరించారు. అనుమానాస్పద పరిస్థితుల్లో వెంటనే 139 నెంబర్ లేదా రైల్వే పోలీస్, గవర్నమెంట్ రైల్వే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.



# కమ్యూనిస్టులను విమర్శించే హక్కు బీజేపీకి లేదు: వేములకొండ

**కొణిజర్ల జూలై 30 మహా:** మండల పరిధిలో చినమునగాల గ్రామంలో బుధవారం జరిగిన సిపిఐ శాఖ సమావేశంలో మండల మాజీ సిపిఐ కార్యదర్శి వేములకొండ రమేష్ మాట్లాడుతూ గత మంగళవారం ఖమ్మంలో జరిగిన బిజెపి సమావేశంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు మాట్లాడుతూ కమ్యూనిస్టులు దేశవ్యాప్తంగా కాదు ప్రపంచవ్యాప్తంగా తుడుచుపెట్టకపోయారని, పొత్తులతో అక్కడక్కడ గేలుస్తున్నారని మాట్లాడటం సమంజసం కాదని విమర్శించారు. బిజెపి పార్టీ మతాన్ని అడ్డుపెట్టుకొని అధికారంలోకి వచ్చిన విషయాన్ని ఆయన గుర్తు పెట్టుకోవాలని తెలిపారు నిరంతరం సమస్యల మీద పోరాడే శక్తి సామర్థ్యం గల పార్టీ ఏదైనా ఉన్నది అంటే అది కేవలం కమ్యూనిస్టు పార్టీలేనని గుర్తు చేసుకోవాలని, అదేవిధంగా ఉమ్మడి ఖమ్మం బిజెపి పార్టీ జిల్లాలో డిపాజిట్లు గల్లంతయిన విషయన్నీ గుర్తుపెట్టుకోవాలని తెలిపారు. కమ్యూనిస్టులు ప్రపంచవ్యాప్తంగా ఏడు దేశాలలో ప్రాతినిధ్యం వహిస్తున్న సంగతి కూడా గుర్తు చేసుకోవాలని అన్నారు. అదేవిధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ గతంలో మాట్లాడటం వలన ఈ రోజున తెలంగాణ రాష్ట్రం లో తెలుగుదేశం పార్టీ అడ్రస్ గల్లంతు అయినట్లుగా బిజెపి పార్టీకి కూడా తెలంగాణలో అదే గతి పడుతుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో బిజెపి పార్టీలో చేరుతామని అగ్ర నాయకులతో సంప్రదించిన వేరే పార్టీ నాయకులు ఎవరైనా ఉంటే వారి పేర్లను దైర్యం ఉంటే బహిరంగంగా చెప్పాలి కాని, ఆలా చెప్పలేని కల్లబొల్లి మాటలను మాట్లాడే హక్కు బిజెపి నాయకులకు లేదని ఆయన అన్నారు. ఏది ఏమైనా ఖచ్చితంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా కమ్యూనిస్టుల కంచుకోటనే అని మాజీ మండల కార్యదర్శి వేములకొండ రమేష్ అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సమితి నాయకులు పాపగంటి సుదర్శన్, సాంసోన్,నాగారపు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



# పోడుదారులతో మాట్లాడుతున్న అధికారులు

**కారేపల్లి, మహా:** ప్లాంటేషన్ పోడులో ఫారెస్టు అధికారులు పనులు ప్రారంభించారు. ప్లాంటేషన్ పోడుపై పోడుదారులు, ఫారెస్టు మధ్య వివాదం సాగుతూ ఉద్రిక్తలకు దారితీసి కేసుపెట్టుకునే వరకు వచ్చింది. ఈక్రమంలో ఫారెస్టు అధికారులు వివాదస్పద ప్లాంటేషన్ పోడులో మంగళవారం నుండి పనులు ప్రారంభించారు. ఖమ్మం రూరల్ ఏసీపీ పరిధిలోని పోలీస్ సిబ్బంది సీఐ తిరుపతిరెడ్డి, కారేపల్లి, కామేపల్లి ఎస్సైల ఆధ్వర్యంలో బందోబస్తు మధ్య ఫారెస్టు అధికారులు బుధవారం కూడా పనులు చేయటానికి జేసీబీలతో ప్లాంటేషన్ పోడుకు వెళ్తుండగా పోడుదారులు అడ్డుకున్నారు. జేసీబీలను అడ్డుకోని తమకు ప్రత్యామ్నాయం చూపిన తర్వాతే ప్లాంటేషన్‌లో పనులు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు, పారెస్టు అధికారులు, పోడుదారులతో మాట్లాడారు. పోడుపై హక్కులు తెచ్చుకుంటే మీ జోలికి రామన్నారు. ప్లాంటేషన్ వేయాలని లక్ష్యం కోసం ప్రత్యామ్నాయం పోడు చూపుతామని మభ్యపుచ్చి మా జీవితాలు ఆగం చేయాలని చూస్తున్నారని పోడుదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంతోమాట్లాడి పట్టాలు తేచ్చుకోవాలని తమ విధులకు ఆటంకం కల్పించవద్దని సూచించారు. ప్లాంటేషన్ పోడు కోసం మాత్రమే ప్రత్యామ్నాయం పోడు చూపుతామని ఫారెస్టు అధికారులే హామీ ఇచ్చారని, ఇప్పుడు ప్రభుత్వం ద్వారా హక్కు తెచ్చుకోవాలని చెప్పటం ఎంతవరకు సమంజసమన్నారు. కేసులు పెట్టి నిర్భందాలు పెట్టిన మా పోడుదక్కేవరకు పోరాటం ఆగేదిలేదని తేగేసి చెప్పారు. ప్లాంటేషన్ పనులకు అడ్డుచెప్పవద్దని ప్లాంటేషన్ పోడుదారుల సమస్యలపై ఖమ్మం ఫారెస్టు కార్యాలయంలో చర్చిద్దామని ఎఫ్‌డీవో వెంకన్ననాయక్ అన్నారు. పోడుదారులతో మాట్లాడిన ఆయన జేసీబీలను వదిలివేయాలని రెండురోజుల తర్వాత సమస్యలపై చర్చిద్దామన్నారు. దీంతో పోడుదారులు జేసీబీలను వదిలివేశారు.



# స్నేహానికి మారుపేరు గుండ్ల రాకేష్..

**తల్లాడ, జులై 30 ( మహా):** స్నేహానికి నిలువెత్తు నిదర్శనం గుండ్ల రాకేష్. ప్రతిఒక్కరిని ఆప్యాయంగా పిలుస్తూ వారితో స్నేహంగా ఉంటూ నిత్యం స్నేహానికి మారుపేరుగా ఉండేవాడు. ఆటల్లో అందర్నీ కలుపుకొనిపోతూ క్రీడల్లో ముందుండేవాడు. షటిల్, వాలీబాల్, క్రికెట్ తదితర క్రీడా పోటీల్లో విరివిగా పాల్గొనేవాడు. ఒకవైపు ప్రైవేటుగా ఉద్యోగం చేస్తూనే ఖాళీ సమయం దొరికినప్పుడల్లా ఆటల్లో పాల్గొనేవాడు. చిన్ననాటి నుండే ఎస్సై కావాలనే కోరికతో ఆటల్లో రాణిస్తూ.. కుటుంబ సభ్యులను మెప్పిస్తూ.. ఆర్థికంగా స్థిరపడుతూనే లక్ష్యం సాధించాలనే పట్టుదలతో జీవితాన్ని నెట్టుకొస్తున్న యవ్వన దశలో ఒక్కసారిగా గుండెపోటు అతని పాలిట శాపమైంది. దీంతో ఆటాడుకుంటునే నమ్మశక్యం కాని విధంగా తుదిశ్వాస విడిచారు.



# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలి..

**తల్లాడ, జులై 30 ( మహా)** కేంద్రంలోని బిజెపి పాసిస్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. సత్తుపల్లి డివిజన్ కమిటీ ప్లీనరీ జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండు అధ్యక్షతన తల్లాడ జివిన్నార్ గార్డెన్లో నిర్వహించారు. తమ్మినేని మాట్లాడుతూ బిజెపిని అధికారానికి దూరం చేసేందుకు ఐక్యంగా పోరాడటంతో 62 పార్లమెంటు సీట్లు తగ్గించగలిగామన్నారు. చంద్రబాబు నాయుడు నితీష్ కుమార్ సహకారంతో కేంద్రంలో మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేశారు అన్నారు, ఇండియా బ్రిటిష్ వ్యాపార ఒప్పందంతో మన దేశ ఉత్పత్తిదారులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. సుంకం లేని వస్తువులు మన దేశంలో కార్చావుగా లభిస్తుంటే మన ఉత్పత్తులను అధిక ధర చెల్లించి ఎవరో కొనుగోలు చేయరని దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను నిరసిస్తూ ప్రదర్శన చేస్తామన్న మహారాష్ట్ర హైకోర్టు హనుమంత ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా నాయకులు తాతా భాస్కరరావు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదినేని రమేష్, జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్రావు, డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి మండల కార్యదర్శి ఐదోల రామలింగేశ్వర రావు, జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాసరావు, మాదాల వెంకటేశ్వరరావు, తన్నీరు కృష్ణార్జునుల పాల్గొన్నారు.



# ప్రత్యామ్నాయ పోడుతోనే సమస్య పరిష్కారం

**కారేపల్లి, మహా :** ఫారెస్టు అధికారులు తమ టార్గెట్ పూర్తిచేయటంకోసం పేదల్కెన పోడుదారులను బలి చేయటం భావ్యం కాదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, సహాయకార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కొండెబోయిన నాగేశ్వరరావు ఉన్నారు. పోడు సమస్యపై ఫారెస్టు, పోలీసులతో అధికారులతో మాట్లాడిన అనంతరం వారు మాట్లాడుతూ 2007లో పోడు హక్కులు ఇచ్చే సమయంలో ప్రస్తుతం ప్లాంటేషన్ పోడు ఉన్న ప్రాంతాలను సాగుచేస్తున్నపేదలను హద్దులుగా చూపి హక్కుపత్రాలు ఇచ్చారన్నారు. సాంకేతిక కారణాలతో ఆవాడు హక్కులు కల్పించలేదన్నారు. తర్వాత కాలంలో పేదల సాగు పోడును ప్లాంటేషన్‌కోసం ప్రత్యామ్నాయ పోడు ఇస్తామని పేరుతో పోడుకు తీసుకోని వారిని ఇబ్బందులకు గురిచేయటం ఎంతవరకు సమజసమ న్నారు. ఫారెస్టు ఉన్నతాధికారులు గడువులు పెట్టి కాలయాపన చేయకుండా సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. ఈకార్యక్రమంలో వ్యకాస నాయకులు తాళ్లపల్లి కృష్ణ, పండుగ కొండయ్య, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు, ఎఫ్ఆర్సీ కమిటీ అధ్యక్షులు వజ్జా రామారావు, కరపటి సీతారాములు, మంగిలాల్, లక్ష్మయ్య, సీఐటీయు మండలకన్వీనర్ కే.నరేంద్ర, బాదావత్ శ్రీను, పోడుదారులు, కరపటి అరుణ, మల్లమ్మ, వెంకమ్మ, ముత్తమ్మ పాల్గొన్నారు.



# గుండ్ల వెంకటేశ్వర్లును పరామర్శించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని..

**తల్లాడ, జులై, 30 (మహా ):** తల్లాడ మాజీ ఉప సర్పంచ్ గుండ్ల వెంకటేశ్వర్లును సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం బుధవారం పరామర్శించారు. ఆయన కుమారుడు గుండ్ల రాకేష్ గుండెపోటుతో అకస్మాత్తుగా మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న తమ్మినేని ఆయన కుటుంబాన్ని పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తొలుత రాకేష్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ధైర్యంగా ఉండాలని అభయమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సిపిఎం మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, నల్లమోతు మోహన్ రావు, పెరిక నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

# పాఠశాలకు బల్లా, కుర్చీల వితరణ

**కారేపల్లి, మహా :** కారేపల్లి మండలం ముత్యాలగూడెం ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయ దంపతులు పాయం పాపారావు-పల్లవి లు బల్లా, కుర్చీలు లను వితరణ చేశారు. బుధవారంపాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయ దంపతులు బల్లా, కుర్చీలను ఎంఈవో దుగ్గిరాల జయరాజు చేతులమీదిగా పాఠశాలకు అందజేశారు. దాతల్కెన ఉపాధ్యాయ దంపతులుఎంఈవో అభినందించారు. ఈకార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం శారద, ఉపాధ్యాయులు వి.శ్రీనివాసరావు, వి.జయ, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

